కథ

# లేడీస్ స్పెషల్

ప్రభావతీ నారాయణ రావు.



హలో గుడ్ మార్నింగ్ అంటూ ప్రక్కకు నిలుచుంది ప్రణతి.

''గుడ్ మార్నింగ్, బండి ఏమయింది? బస్టాప్‌కి వచ్చావు!'' అంది నవ్వుతూ.

లలితకి ప్రణతి వరుసకి చెల్లెలు అవుతుంది. అందరిని ఆట పట్టిస్తూ, నవ్వుతూ సరదాగా వుంటుంది. పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేసింది. ఈ మధ్యనే వుద్యోగంలో చేరింది. కెనెటిక్‌హోండా వుంది. దానిమీదే ఆఫీస్‌కి వెళుతుంది. లలిత సెక్రటేరియట్‌లో చేస్తోంది.

''లేడీస్ స్పెషల్ వస్తోంది ఎక్కుదామా?'' అంది లలిత. నేను వెనుక నుంచి ఎక్కుతాను, నువ్వు ముందు నుంచి ఎక్కి మధ్యలోకిరా! నేనెవరో నీవెవరో'' అంటూ వెళ్లిపోయింది ప్రణతి.

లలితకి అర్థం అయింది ఏదో అల్లరి చేస్తుందని నవ్వుకుంటూ బస్‌వైపు నడిచింది.

రష్‌గానే వుంది బస్ వెనుక నుంచి ఎక్కిన ప్రణతి మెల్లిగా లోపలికి బయలుదేరింది. కండక్టర్ వెనుకనే వున్నాడు. ఎజి ఆఫీస్‌కి టికట్ తీసుకుంది ప్రణతి. కుర్ర కండక్టర్ ప్రణతికి టికెట్ యిచ్చి ముందుకు బయలుదేరాడు. చాలా మందివి పాస్‌లే. వెళ్తున్న కండక్టర్‌ని ఉద్దేశించి ''ఈ మధ్య లేడీ కండక్టర్‌ని అపాయింట్ చేశారు. కదయ్యా యింకా లేడీస్ స్పెషల్‌లో నిన్నెందుకు వుంచినట్లో'' అంది వెళ్తున్న కండక్టరు.

వెనక్కి తిరిగి చూసి ఒక్కసారి నవ్వి ముందుకి వెళ్లిపోయాడు.

లేడిస్ స్పెషల్‌లో కండక్టర్స్ సాధారణంగా పోట్లాడరు. అప్పటికే లలిత బస్ మధ్యలోకి వచ్చి రాడ్‌ని అనుకుని నిలబడింది.

బస్‌లో యిద్దరు, ముగ్గురు కూర్చున్న వాళ్లు నించున్న వాళ్లు కలిసి మాట్లాడుకుంటున్నారు.

ప్రణతి ప్రక్కనే నిలబడ్డ ఆవిడ ఎర్రటి ప్రింట్ వున్న తెల్లటి కాటన్ చీర కట్టుకుంది. దానిమీద ఎర్రని సిల్కు జాకెట్ వేసుకుంది ఆవిడకే విన్పించేట్లు అంది ప్రణతి.

''కాటన్ చీర మీదకి కాటన్ జాకెట్టే బాగుంటుంది.''

కొంచెం ముందుకు జరిగింది ప్రణతి.

ప్రక్కనే వున్న మరో యిద్దరికి కూడా విన్పించింది. ఆవిడ తెల్లబోయింది ఏమనడానికి తోచలేదు.

ప్రణతి ముందున్న ఆవిడని చూసింది. బాగ్‌కి పిన్నీసు పెట్టింది.

అప్పటికే తెగితే ఒకసారి కుట్టించినట్లు వుంది. ఆవిడతో అంది ప్రణతి.

''చూస్తే మంచి వుద్యోగమే చేస్తున్నట్లున్నారు. నాలుగు వందల రూపాయల చీర, నగలు అన్నీ బాగుండి బీద బేగ్ ఏమిటండి''?

అరగంట స్పేర్ చేసి కొత్తది కొనుక్కోండి చక్కగా ఆవిడకి మాట పడిపోయిందీ హఠాత్పరిణామానికి.

ఇంకొంచెం ముందుకి వచ్చింది ప్రణతి. వెనుకవున్న వాళ్ల మాటలన్నీ ఆగిపోయాయి. కొంత మంది ఆలోచనల్లో పడ్డారు. కొంత మంది ఎటో చూస్తున్నారు. కొందరు ముందు నుంచే నిద్రపోతున్నారు.

యింకొంచం ముందుకి వచ్చిన ప్రణతికి స్థూలకాయురాలు పంజాబీ డ్రెస్‌లో కన్పించింది. ఆవిడ ప్రక్కనే నుంచుని ముందు కొంచెం ఒళ్లుతగ్గే మార్గం చూడండి, తరువాత ఈ డ్రెస్‌లు వేసుకోండి. అప్పటి వరకు సన్నటి చీరలు కట్టుకోండి బాగుంటారు'' అంది ప్రణతి.

ఆవిడసిగ్గుతో తలొంచుకుంది.

ఇటు పక్కకి తిరిగింది ప్రణతి. నల్లగా వున్న చాలా అందంగా వుంది. కాకపోతే పౌడర్ ఎక్కువగా రాసింది. ఆవిడతో ''హాయ్ బ్లాక్ బ్యూటీ!'' అనగానే నవ్వబోయిన ఆమె ముఖంలో నవ్వు ఆగిపోయింది.

తరువాత మాట విని ''బాగున్నారు కాని పౌడర్ కొంచెం తగ్గించండి, లేకపోతే బూడిద గుమ్మడి కాయ అంటారు'' అంది ప్రణతి.

అక్కడే వున్న లలిత నోటికి జేబురుమాలు అడ్డు పెట్టుకుని నవ్వు ఆపుకుంటోంది.

''ఏం మేడమ్! అంత భరించలేని వాసన




వేస్తోందా?'' అంది ప్రణతి.

''అబ్బే అదేంలేదు నా జలుబు అందరికి అంటుకుంటుందేమోనని జాగ్రత్త'' అంది నవ్వుతూ.

అప్పటి దాకా ప్రణతికి సమాధానం చెప్పిన వాళ్లెవరు లేరు. ఎందుకంటే ఊహించనిదే కాకుండా ప్రణతి అవకాశం యివ్వకుండా ముందుకి వెళ్లి పోతోంది. లలితని కూడా ఆశ్చర్యంగా చూసారు చాలామంది.

''మంచి మాటే చెప్పారు. అంటు కుంటుందేమో?'' భయపడుతున్నట్టు ఫోజు పెట్టి లలితని దాటి ముందుకి వచ్చింది ప్రణతి.

మల్లెపూల వాసన గుప్పుమంది. పట్టుచీర, పట్టు జాకెట్, మెళ్లో నగలు, నడి వయసు పరవా లేదు కాని తల్లో తట్టెడు పూలు. ఆవిడ చెవిలో ''మహాలక్ష్మిలా బాగున్నారు కాని అన్నిపూలు ఆఫీస్‌కి బాగుండవు.

చిన్నమాట. ముచ్చటగా ఒక్క చిన్న గులాబీ పెట్టుకోండి చక్కగా వుంటారు. రాత్రి బెడ్‌రూమ్‌లో పెట్టుకోండి ఈ పూలన్నీ'' అంది.

చాలా మందికి ఆవిడ్ని చూస్తే అలాగే అనిపిస్తుంది. కాని చెప్పడానికి ధైర్యం వుండదు. ప్రణతి అన్న మాటకి చిన్నబోయిందా మహాలక్ష్మి.

''హర్ట్ చేస్తే సారీ'' అంది సిన్సియర్‌గా ప్రణతి. ఆవిడ నవ్వేసి తల తిప్పుకుంది.

ప్రక్కనే కూర్చున్న అమ్మాయి వైపు దృష్టి పడింది. చాలా బాగుంది కాని పెళ్ళై కొద్దిగా ఆ అమ్మాయితో డెంటల్ హాస్పటల్‌కి వెళ్లి క్లిప్ వేయించుకుని ట్రీట్‌మెంటు తీసుకోయింకా అందంగా వుంటావు'' అంది.

ఆ అమ్మాయి సిగ్గుపడుతూ అలాగే అన్నట్లు తలూపింది. గుడ్ అంటూ భుజం తట్టి యింకొంచెం ముందుకి వెళ్లింది.

అందరి దృష్టి ప్రణతి మీదే వుంది. నిద్రబోయే వాళ్లు కూడా లేచి అర్థం చేసుకోడానికి ప్రయత్నిస్తున్నారు.

ప్రణతి అన్న మాటలన్ని నిజాలే కాని ఏమిటీ ధైర్యం మాటల్లో హేళనలేదు.

సున్నితంగా చెప్పింది స్నేహభావం వుంది. ఎప్పుడూ నవ్వుతున్నట్లుండే స్మైలింగ్ ఫేస్. వయసు యిర్వై అయిదు మధ్య వుండచ్చు అయిదడుగుల అయిదంగుళాలు పొడుగు సన్నగా అన్పిస్తుంది. మంచి కనుముక్కు తీరు. పెద్ద జడ కాశ్మీర్ సిల్కు చీరలో అందంగా నాజూకుగా వుంది ప్రణతి. బాగుంది అనుకున్నారు చాలా మంది మనసుల్లో. అందరూ ఒకరి గురించి మరొకరు చాటుగా కామెంట్ చేస్తూనే వుంటారు.

కాని ఈరోజు పరిస్థితి వేరుగా వుంది.

కాబిన్ దాకా వచ్చింది ప్రణతి. పక్కనే వున్నావిడని చూసింది. పక్క రాడ్ పట్టుకుని నిల్చుందావిడ. జుట్టు సగం నెరిసింది. వాలుజడ అసలు సూట్ కాలేదు.

''మీకు జడ బాగోలేదు. బ్యూటీ క్లినిక్‌కి వెళ్లి రెండు, మూడు ఫ్యాషన్ ముడులు నేర్చుకుని వేసుకోండి బాగుంటుంది'' అంది ప్రణతి.

ఆవిడ తెల్లబోయి ఏదో అనబోయింది. కాని ఇంతలోనే లలిత ''బాపు బొమ్మలా వుంది పిల్ల'' అంది. గట్టిగా ఆ మాటలకు ముందుసీటులో కూర్చున్న బామ్మగారు ''బంగారు బొమ్మలా వుంది'' అంది.

''అయితే ఏభై కిలోల బంగారం ఎవరికి సొంతమో'' అంది లలిత.

''థ్యాంక్యూ ఫర్‌ది కాంప్లిమెంట్'' అంది లలిత కేసి చూస్తూ. బస్ స్టాప్ దగ్గరకు వస్తోంది. ఇక దిగెయ్యాలన్పించింది ప్రణతికి. దిగబోతున్న ప్రణతిని కండక్టర్ అడిగాడు మేడమ్ మీరు ఎజి ఆఫీస్‌కి టికెట్ తీసుకున్నారుగా?''

''జ్ఞాపకశక్తి బాగుంది యింకా చదువుకో వృద్ధిలోకి వస్తావు. పోస్టాఫీస్‌లో పనుంది అంది సమాధానంగా. ఏమనుకోకపోతే మీ పేరు అన్నాడు కండక్టర్ ధైర్యం చేసి.

''సుబ్బులక్ష్మి'' అని నవ్వుతూ బస్సు దిగేసింది ప్రణతి. అది విని అందరికి నవ్వొచ్చింది. అబద్దం అనుకున్నారందరు. కాని రోజులా లేదు బస్సు. మాటలు తగ్గి ఆలోచనల్లో పడ్డారంతా. లలిత చాలా సార్లే ఆ బస్ ఎక్కుతుంది. కాని ఎక్కువగా ఎవరితోను మాట్లాడదు. ప్రణతి మాటలు చాలామంది మీద పనిచేసాయి. ఉన్నంతలో డిగ్నిఫైడ్‌గా వుండడానికి ప్రయత్నిస్తున్నారు. అందరితో స్నేహభావం పెరిగింది. చాటుగా కామెంట్లు చేసే గుణం తగ్గింది. చాలా ఆశ్చర్యంగా అన్పించింది లలితకి.

చాలా రోజుల తరువాత బాబాయి గారింట్లో ఫంక్షన్‌లో కన్పించింది ప్రణతి.

లేడీస్ స్పెషల్‌లో వచ్చిన మార్పు గురించి చెప్పింది లలిత. ప్రణతి మాటలు గుర్తు చేసుకొని నవ్వింది.

''నన్నెరగనట్లు బాగా నటించావే నాటకాల్లో పనికొస్తావ్ అంది ప్రణతి.

''మళ్ళీ ఎప్పుడు కనపడతావ్'' అంది బండి స్టార్ట్ చేస్తున్న ప్రణతితో.

''మళ్లీ బండి సర్వీసింగ్‌కి ఇచ్చినపుడు లేడీస్ స్పెషల్ ఎక్కుతా. మార్పుని మెచ్చుకోవద్దూ?'' అంది ప్రణతి నవ్వు ముఖంతో సీరియస్‌గా.



